# అవాస్తవికత

ఉదయం తొమ్మిది గంటలు దాటుతుండగా, అప్పటికప్పుడే 'బ్రేక్‌ఫాస్ట్' ముగించి, వరండాలో వాలు కుర్చీలో పడుకొని, కాఫీ నెమ్మదిగా సేవిస్తూ, ఆ వేళటి దినపత్రికను విరామంగా చదువుతూన్న వెంకటరామయ్య, గేటు చప్పుడు వినిపించి, మెల్లగా తల తిప్పి అటువేపు చూశాడు.

గేటు తెరుచుకొని నెమ్మదిగా కాంపౌండ్‌లోకి అడుగు పెడుతున్న శాస్త్రీని చూడగానే, "రావోయ్! రా! చాలా రోజులకు కన్పించావ్" అంటూ చిరునవ్వుతో ఆహ్వానించాడు వెంకటరామయ్య. ఆ వచ్చినవాడు అతని పాత మిత్రుడు కృష్ణమూర్తి.

"నీ ఇల్లు కనుక్కోటానికి చాలా కష్టపడ్డానోయ్! నిన్న నీ పాత అడ్రస్‌కు వెళ్తే, పక్క పోర్షను వాళ్ళు, 'నువ్వు కొత్తగా ఇల్లు కట్టుకున్నావనీ, మూడు నెల్ల క్రితమే ఇల్లు మారావనీ,' నీ ఇంటి గుర్తులతో సహా చెప్పారు. చాలా ఏళ్ళయింది కదూ నిన్ను చూడక! మళ్ళీ ఎప్పుడు కలుస్తానో ఏమో అని ఇల్లు వెతుక్కుంటూ యిలా వచ్చాను" అంటూ వెంకట్రామయ్య కెదురుగా వున్న కుర్చీలో కూచున్నాడు కృష్ణమూర్తి.

అతని మాటల్లో తన కొత్త ఇంటి ప్రస్తావన రావటంతో వెంకటరామయ్య ముఖం ఆనందంతో వెలిగి పోయింది.

'అవున్రా! కొత్త ఇంట్లో చేరి మూన్నెల్లయింది. ఇల్లు పూర్తి చేయటానికి దాదాపు సంవత్సరం పట్టిందనుకో! ఇల్లు కట్టడానికి నేను పడ్డ హైరానా చెపితే ఒక గ్రంథం అవుతుంది.' అన్నాడు వెంకట్రామయ్య, ఒక మహత్తర కార్యం పూర్తి చేసిన తృప్తి ముఖంలో తొణికిసలాడుతూండగా.

కృష్ణమూర్తి తాను కూచున్న వరండానంతా పరిశీలనగా పరకాయించాడు. వరండాకు రెండు వేపులా చక్కటి గ్రిల్, గ్రిల్ మీద అల్లుకున్న ఏవో పూల తీగలూ, మెట్లకు అటూ ఇటూ అందమైన పూల కుంపట్లూ, వరండాలో నేల మీద పరచిన తెల్లటి పాలిష్‌బండలూ, వరండాకు కుడివేపున డ్రాయింగ్ రూమ్, గది తలుపులకు వేలాడుతూన్న పాము కుబుసం లాంటి కర్టెనూ, గోడలకు వేసిన గోధుమ రంగు

పెయింటింగూ, గది మధ్యలో చూరు నుండీ వేలాడుతూ నెమ్మదిగా తిరుగతూన్న ఫానూ, ఇంకా కొత్త వాసన వేస్తున్న ఇంటి వాతావరణమూ, ముగ్ధుణ్ణి చేశాయి కృష్ణమూర్తిని.

“మొత్తానికి అనుకున్న పని సాధించావోయ్! నిన్ను ఎప్పుడు కలిసినా, సొంత యిల్లు కట్టుకోవటం గురించే మాట్లాడేవానివి! రిటైరయ్యాకయినా నీ కోరిక నెరవేరింది. ఇంతకూ ఏమాత్రమయింది ఇంటికి?” అన్నాడు వెంకట్రామయ్యను మెచ్చుకోలుగా చూస్తూ కృష్ణమూర్తి.

“మూడు లక్షలు దాటిందోయ్! గ్రాట్యుటీ, పి.ఎఫ్., పెన్షన్ అమ్ముకున్న డబ్బూ కాక ఎల్.ఐ.సీ. లోనూ అంతా కలిపితే ఈ ఇల్లు తయారయింది. ఎంత శ్రమా, ఎన్ని బాధలూ – చెపితే, తీరేవి కావులే! ఇల్లంతా ఒకసారి చూద్దువుగాని, ముందు టిఫినూ, కాఫీ ముగించు – ” అంటూ లోపలి వేపు ఓ సారి తొంగిచూస్తూ, “పార్వతీ మన కృష్ణమూర్తి వచ్చాడు చూడు” అంటూ గట్టిగా కేక వేశాడు భార్యను, వెంకటరామయ్య.

లోపల్నుంచీ పార్వతమ్మ నెమ్మదిగా బయటకు వచ్చి, కృష్ణమూర్తిని చూసి నవ్వు మొగంతో, “బావున్నారా అన్నయ్యా! చాలా నాళ్ళయింది మిమ్మల్ని చూడక” అంటూ పరామర్శ చేసింది.

కృష్ణమూర్తి ఆమెను ఆపాదమస్తకమూ పరకాయించి చూస్తూ, “నా కులాసాకేం గాని! నువ్వేమిటమ్మా ఇలా అయిపోయావ్! ఎలా వుండేదానివి, ఇలా చిక్కిపోయావేమిటి?” అన్నాడు ఆశ్చర్యపోతూ.

“ఏమిటోరా మూర్తీ, రెండు నెల్ల క్రితం పెరట్లో కాలు జారిపడింది. చిన్నగా ఇలుకు పట్టుకుంది. అంతే! అప్పట్నుంచీ కీళ్ళ నొప్పులూ, కాళ్ళ నొప్పులూ అంటూ ఏనుగులా వున్న మనిషి పీనుగులా అయింది! ఎందరు డాక్టర్లకు చూపినా, ఎన్ని మందులు వాడినా ఏ మాత్రమూ మెరుగు పడటం లేదు” అంటూ విచారంగా చెప్పుకొచ్చాడు వెంకటరామయ్య.

“ఏదోలే అన్నయ్యా! అంతా నా ఖర్మ. మీరు లేచి రండి. కాస్త టిఫిన్ పుచ్చుకుందురుగాని” అంది ఆవిడ. ఆమె గొంతులోని మాట ఎక్కడో నూతి లోంచివచ్చినట్టుగా అనిపించి దిగులు వేసింది కృష్ణమూర్తికి.

"మా అల్లునింట్లో తినేవచ్చానమ్మా! కాస్త కాఫీ ఇవ్వు చాలు" అన్నాడు కృష్ణమూర్తి. ఆమె మరేమీ మాట్లాడకుండా ముక్కుతూ మూలుగుతూ నెమ్మదిగా లోపలకు వెళ్ళింది.

"అది సరే! మీ అబ్బాయిలేం చేస్తున్నార్రా! పెద్దవాడిది రెండేళ్ళ క్రితమే 'ఎమ్మెస్సీ' అయిపోయినట్టు గుర్తు" – "ఏదైనా ఉద్యోగంలో చేరాడా ఏమిటి" అడిగాడు కృష్ణమూర్తి.

"వాడిదంతా పెద్ద కథలే మూర్తీ! ఎమ్మెస్సీ పూర్తయింతర్వాత అదేదో 'గ్రూప్ వన్' కోచింగ్ కని హైదరాబాద్ వెళ్ళి సంవత్సరం పాటు అక్కడ కూచుని పాతిక వేలుదాకా తగలేశాడు. అడ్డమొచ్చిన పరీక్షలన్నీ రాస్తున్నాడు. ఏ ఫలితమూ లేదు. చదివి చదివి వాడికీ విసుగొచ్చి వీధులు పట్టుకు తిరుగుతున్నాడు. ఇక, రెండో వాడంటావా, మొన్న రిజల్ట్స్ వచ్చాయి గదా! బి.ఏ. ఫెయిలయి కూచున్నాడు. 'ఈ సారైనా బాగా చదవరా' అంటే, 'చదివి చదివి అన్నయ్యేం భోంచేస్తున్నాడు' అంటూ రెట్టమతంగా వాగుతాడు" అంటూ తన గోడంతా ఒలకపోసుకున్నాడు వెంకటరామయ్య.

ఇంతలో పార్వతమ్మ కాఫీకప్పు అందివ్వగా, రెండు గుటకలు చప్పరించి, "అమ్మాయికి పెళ్ళి సంబంధాలేమైనా చూస్తున్నారా! అయినా మేనరికం ఒకటుంది గదా" అన్నాడు కృష్ణమూర్తి.

"ఆ ఆశా పోయినట్టే అన్నయ్యా! గృహప్రవేశమప్పుడు ఈయనగారి చెల్లెలికీ, బావకూ బట్టలు పెట్టలేదని ఇంటిల్లపాదీ నిష్ఠూరం చేసి నానా మాటలూ అని వెళ్ళిపోయారు. అది హద్దు! వాళ్ళకూ మాకూ సంబంధాలు తెగిపొయ్యాయి. ఈ మధ్యనే వాళ్ళ అబ్బాయికి వేరే సంబంధం చూస్తున్నట్టు మా బంధువొకాయన చెవిని వేశాడు" అంది నిట్టూరుస్తూ పార్వతమ్మ.

"ఇదీ రా కథ! కొత్త ఇంట్లో చేరామన్న ఆనందమే లేకపోయింది" అన్నాడు దిగులుగా కృష్ణమూర్తి.

కృష్ణమూర్తి కాఫీ ముగించి, కప్పు పార్వతమ్మకందిస్తూ, "నువ్వు చెప్పిన విషయాలన్నీ వింటూంటే, నీ ఇంటినంతా ఓ సారి జాగ్రత్తగా చూడాలనిపిస్తోంది." అంటూ లేచి నిలబడ్డాడు.

వెంకటరామయ్య లేచి నిల్చొని, "అలాగే చూడవోయ్!" అంటూ కృష్ణమూర్తిని వెంటబెట్టుకుని లోపలకు తీసుకెళ్ళాడు.

వరండాలోంచి లోపలకు వెళ్ళగానే మొదట విశాలమైన హాలు – హాల్లో ఒక సోఫా, నాలుగు కుర్చీలూ, వాటి ముందు టీపాయ్, ఒకమూల స్టాండ్ మీద టీ.వీ.,

హాలుకు కుడివేపు ఓ బెడ్ రూమూ, బెడ్ రూమ్ పక్కనే స్నానాల గది, స్నానాల గదికానుకొని వంటిల్లూ – హాల్లోంచి పెరట్లోకి తలుపూ – కృష్ణమూర్తి ప్రతి గదినీ సాకల్యంగా పరీక్షలు చేస్తున్నట్టు తల పంకిస్తూ చూస్తున్నాడు. గదుల తలుపులూ, కిటికీలు కూడా జాగ్రత్తగా చూశాడు. గదుల కొలతలు అడిగి తెలుసుకున్నాడు.

ఇద్దరూ హాల్లోంచి పెరట్లోకి నడిచారు. పెరడు విశాలంగా ఉంది. పెరట్లో ఒక మునగచెట్టు, రెండు బొప్పాయి చెట్లూ అక్కడే నైరుతి వేపు 'లావెట్రీ' ఉంది. లావెట్రీని అనుమానంగా చూస్తూ, "ఇది లావెట్రీ యేనా?" అనడిగాడు వెంకటరామయ్యను. వెంకట రామయ్య తలూపాడు.

కృష్ణమూర్తి వెంటనే అతని వేపు ఒక అపరాధిని చూసినట్టుగా చూపు విసిరేసి, "ఎవడ్రా నీకు ఈ ఇంటి ప్లాను వేయించింది" అన్నాడు ముఖం వికారంగా పెట్టి.

"పెద్దగా ప్లాన్ అంటూ ఎవరితోనూ గీయించలేదు. అంతా ఆ బేల్దారు నరసింహులే చూసి పెట్టాడు" అన్నాడు వెంకటరామయ్య నేరస్థుడిలా చేతులు కట్టుకుని.

"ఆ కట్టినవాడికి బుద్ధిలేకపోతే, నీ తెలివైనా పని చేయలేదట్రా! చూసి చూసి ఎవరైనా నైరుతి మూల లావెట్రి కట్టుకుంటారట్రా" అంటూ ఒక చిన్న బాంబు పేల్చాడు కృష్ణమూర్తి.

వెంకటరామయ్య ఈ మాటకు అదిరిపోయాడు. "ఏమిరా! ఏదైనా పొరపాటు జరిగిందా?" అన్నాడు దాదాపు వణికి పోతున్న ధోరణిలో.

"పొరపాటా? పొరపాటున్నరా? నైరుతిమూల అంటే ఏమనుకున్నావురా? ఎంత పవిత్ర స్థానమనుకున్నావ్? అలాంటి స్థలంలో లావెట్రీ కట్టుకుంటే ఆరోగ్య క్షీణమే కాకుండా కుటుంబ అభివృద్ధి కూడా ఉండదు. – నువ్వు ఇందాకా నీ కుటుంబ వ్యవహారాలన్నీ చెబుతున్నప్పుడే నాకు అనుమానం వేసింది, వాస్తులో ఎక్కడో లోపం జరిగి వుంటుందని" అంటూ చావు కబురు చల్లగా చెప్పాడు కృష్ణమూర్తి చేతులు వూపుతూ –

వెంకటరామయ్య గుండెల్లో చిన్న దడలాంటిది ప్రారంభమయింది. మిత్రుని వేపు బిత్తరచూపులు చూస్తూ, "అంతేనంటావ్రటా! నువ్వన్నట్టు నాకూ ఎక్కడో ఓమూల చిన్న అనుమానం ఇటీవల సలుపుతూ పీడిస్తూనే వుంది. ఎక్కడైనా వాస్తులోపం జరిగిందేమోనని! కాకపోతే ఈ ఇంట్లో చేరిననాడే బంధుత్వాలు తెగి పోవడమేమిటి, నెల తిరగకుండానే దాని ఆరోగ్యం క్షీణించడమేమిటి, క్లాసులో పాసవుతానన్న

రెండోవాడు ఫెయిల్ కావడమేమిటి, పెద్దవాడు వీధులు పట్టుకు తిరగడమేమిటి, ఎక్కడో ఏదో లోపం జరక్కపోతే ఇన్ని అనర్థాలా? బయటికి చెప్పుకుంటే ఎవ్వరేమంటారో అన్న భయంతో ఇన్నాళ్ళూ ఉండిపోయాను – అయినా ఇప్పుడు మనం చేయగలిగింది ఏముంది?" అన్నాడు క్షీణ స్వరంతో నిస్సహాయత వ్యక్తం చేస్తూ.

"అలా అనుకొని గాలికి వదిలేస్తావేమిట్రా! నాకు తెలిసినంతవరకూ ఒక చిన్న ఉపాయం చెబుతాను. లావెట్రీ అక్కడున్నా ఫరవాలేదు గాని, దాని గుంతను మాత్రం పూడ్చి వేసి మరో చోటుకు మార్చు, దోషం తొలగి పోతుంది" అని సలహా యిచ్చాడు కృష్ణమూర్తి.

వెంకటరామయ్య ఆలోచనల్లో పడిపోయాడు. నాలుగైదు నిమిషాలు నిశ్శబ్దంగా ఉండి, "గుంత మాత్రం మారిస్తే, వాస్తు ఒప్పుకుంటుందా?" అనడిగాడు సందేహం ధ్వనిస్తూ–

"ఇది ఏ మాత్రమూ వాస్తు విరుద్ధం కాదు – అవసరమనిపిస్తే మరి కొందర్ని అడిగి చూడు – గుంత అక్కడుండటం మాత్రం అన్ని విధాలా అరిష్టం. ఆ తర్వాత నీ ఇష్టం... నా కున్న అనుభవాన్ని బట్టి చెబుతున్నాను –" అన్నాడు ఇక నీ తిప్పలేవో నీవు పడు అన్న ధోరణిలో.

ఆ తర్వాత కృష్ణమూర్తి వెంకటరామయ్యను తీరిగ్గా కూచోబెట్టుకుని, ఒక గంటసేపు వాస్తుశాస్త్ర మహిమలను సోపపత్తికంగా నిరూపిస్తూ ఉపన్యాసమిచ్చాడు.

"విజయనగరమంతటి మహా సామ్రాజ్యం వాస్తు లోపం వల్లనే నాశనమై పోయింది. బాబ్రీ మసీదు, అంత వివాదాస్పదం కావటానికీ, కూలి పోవటానికీ కారణమేమిటనుకున్నావ్? వాస్తు లోపమే! అంతెందుకు? హైదరాబాద్‌లో బుద్ధ విగ్రహం వాస్తు సరిగా లేకపోవటం వల్లనే నీళ్లలో మునిగి పోయింది – ఇక నీ ఇల్లనగా ఎంత? అందుకే జాగ్రత్తపడు..." అంటూ బోధ చేసి, వెంకటరామయ్య గుండెల్లో శతఘ్నులు మోగించి, వచ్చిన కార్యం పూర్తి చేసినవానిలా చక్కా వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి.

వారం రోజుల పాటు వెంకటరామయ్య మానసికంగా చాలా నలిగి పోయాడు. అనుమాన నివృత్తి కోసం ఒక వాస్తు నిపుణున్ని కలిసి విషయం విన్నవించుకున్నాడు,

వందరూపాయలు దక్షిణ సమర్పించుకుని. కృష్ణమూర్తి చెప్పిన అభిప్రాయాన్ని ఆ పెద్ద మనిషి కూడా బలపరచడంతో ఒక నిశ్చయానికి వచ్చి, వెంటనే కార్యరంగంలోకి దుమికాడు.

'లావెట్రీ' గుంతను పూడ్పించి, 15 గజాల దూరంలో, వాయవ్య మూలను కొత్తగా 'గుంత' తీయించి, లావెట్రీతో దాన్ని అనుసంధించి, ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నాడు వెంకట్రామయ్య. అయితే ఆయన పీల్చుకున్న ప్రశాంతమైన ఊపిరికి ఐదు వేలదాకా ఖర్చు వచ్చింది. అయితే ఆ ప్రశాంతత కూడా ఆయనకు ఎక్కువ కాలం నిలవలేదు. నెల రోజులు కూడా దాటక ముందే మళ్ళీ కొత్త కొత్త అనుమానాలు ప్రారంభమయ్యాయి.

ఈ నెల రోజుల్లో ఆయనకు వాస్తు పిచ్చి బాగా తలకెక్కింది. ఎవర్ని కలిసినా, ఆ మాటా ఈ మాటా మాట్లాడి చివరకు సంభాషణను వాస్తు ముగ్గులోకి దించే స్థితికి వచ్చాడు. ఎక్కడ కొత్త ఇల్లు కడుతున్నా అక్కడికి పని గట్టుకొని వెళ్ళి ఆ యింటి యజమానుల్తో పిచ్చాపాటీ వేసి, తనకున్న మిడిమిడి జ్ఞానంతో వాస్తు గురించి చెప్పాలని ప్రయత్నించేవాడు. నాలుగైదు వాస్తు పుస్తకాలు కొని ముందరేసుకుని దీక్షగా చదువుతూ, తన ఇంటికి అన్వయించుకొనేందుకు ప్రయత్నాలుచేసేవాడు. ఒక పుస్తకానికీ మరో పుస్తకానికీ అక్కడక్కడా తేడాలు కనిపించి ఏది నిజమో తెలీక తల పట్టుకునేవాడు... తన ఇంటినంతా ఒక మంచి వాస్తు నిపుణులతో సర్వే చేయిస్తే బావుంటుందేమో అని అతని మనసు పీకుతూ వుండేది.

సరిగ్గా అతనీ ఆలోచనల్లో వున్నప్పుడే హైదరాబాదునుంచీ ఒక వాస్తు నిపుణుడు ఆ వూరు వచ్చాడు. ఆ వచ్చిన వాస్తు నిపుణుడు అల్లాటప్పా రకం కాదు. ఆ రంగంలో కీర్తి ప్రతిష్టల్ని రాష్ట్ర వ్యాప్తంగా సంపాదించినవాడట! కేవలం ఇళ్ళే కాకుండా, ఫ్యాక్టరీలూ, సినిమా హాళ్ళూ, వ్యాపార సంస్థలూ – ఇలా ఎన్నింటికో అసంఖ్యాకంగా వాస్తు నిర్ణయం చేసిన వాడట! ఆయన ఇటీవల రాసిన ఒక వాస్తు గ్రంథం ఎంతో ప్రామాణికంగా గుర్తింపబడి దేశం మొత్తం మీద సంచలనం సృష్టించిందట. వెంకటరామయ్య పెద్ద పెద్ద రికమెండేషన్లు సంపాదించి ఆయనతో అపాయింట్‌మెంటు ఏర్పాటు చేసుకుని, తన గృహం సందర్శించి తన్ను సమస్యల్నుంచి రక్షించమని ప్రాధేయపడ్డాడు. ఎట్టకేలకు నాలుగు రోజుల తర్వాత ఆయన వెంకటరామయ్య ఇంటికి ఒక పొడువాటి కారులో విచ్చేశాడు. ఆయన రాక కోసం వెంకటరామయ్య

ఐదు వేలు ఫీజు కింద సమర్పించుకోవాల్సి వచ్చింది. గౌరవ మర్యాదలు, ఉపాహారాలూ, సత్కారాలు పూర్తయింతర్వాత ఆ వచ్చినాయన, ఇంటినంతా పది నిమిషాలు పరీక్షించి అంతిమంగా చెప్పిందేమిటంటే, – ''చూడండి వెంకటరామయ్యగారూ! ఉత్తరం వేపు ముఖ ద్వారం ఉంచటం ఒక్కటే మీ గృహ నిర్మాణంలో వున్న మంచి విషయం! ఉన్న లోపాలన్నీ చెబితే మీరు హడలి పోతారు – కాని కొన్ని ప్రధానమైన లోపాల్ని సవరించుకుంటే దోషాలు తొలగి పోతాయి. మీ యింటి 'ఫ్లోరింగ్' ఉత్తరం వేపు అంటే ముఖ ద్వారం వేపు ఎత్తుగానూ, దక్షిణం వేపు పల్లంగానూ ఉంది. ఇది వాస్తు శాస్త్ర విరుద్ధం. అందువల్ల మీ సంపదలు క్షీణించడమే కాకుండా ఆయురారోగ్యాలు నశిస్తాయి. కాబట్టి మీరు వెంటనే దక్షిణం వేపు ఎత్తు వుండేలా మొత్తం ఫ్లోరింగ్ సవరించండి. ఇక ఇంటి గుమ్మాలూ, కిటికీలూ మొత్తం కలిపితే బేసి సంఖ్యలో ఉన్నాయి. అది అరిష్టం. కాబట్టి మీరు హాల్లో తూర్పు వేపు ఒక పెద్ద కిటికీ ఏర్పాటు చేసుకోండి. ఈ దోషాలు తొలగించుకుంటే మీరిక నిశ్చింతగా ఉండవచ్చు" అంటూ ఒక విధి విధాన ప్రకటన లాంటిది చేసి వెంకటరామయ్యను ఆశీర్వదించి నిష్క్రమించాడు.

ఆయనగారు వెళ్ళిపోయిం తర్వాత, వెంకటరామయ్య మనసంతా మళ్ళీ అల్లకల్లోలం అయిపోయింది. పార్వతమ్మ అతని వేపు అయోమయంగా చూస్తూ, "ఆ పెద్దమనిషి చెప్పిందంతా నిజమేనంటారా" అంది.

వెంకటరామయ్య ఊపిరి పీల్చుకొని, "వాళ్ళెందుకు మనతో అద్ధాలు చెబుతారే? శాస్త్రం ఎలా వుంటే అలా చెబుతారు. ఆయన చెప్పిన మార్పులు చేయించటానికి అయ్యే ఖర్చు గురించే నేనిప్పుడు భయపడుతున్నాను." అన్నాడు దిగులు మొగంతో.

"జరిగిందేదో జరిగి పోయింది. తెలిసీ తెలిసీ ఈ ఇల్లును మనం ఇలాగే వుంచుకుంటే ఎట్లా? ఏదో ఒకటి చేయండి." అంది పార్వతమ్మ.

వెంకటరామయ్యకు పది రోజుల పాటు మళ్లీ మనస్థిమితం లేకుండా పోయింది. ఇంట్లో 'ఫ్లోరింగ్' అంతా సవరించాలంటే చాలా పెద్ద పని! ఇల్లంతా మొత్తం పాలిష్ బండలు పరిపించాడు తను! వాటిని మొత్తం ఇప్పుడు తొలగించాలంటే మాటలా? తొలగింపు పనిలో ఎన్ని బండలు పగిలిపోతాయో? ఎన్ని మిగులుతాయో? ఈ పనికి లేబర్ ఖర్చు కూడా చాలా ఎక్కువే! హాల్లో తూర్పు వేపు గోడకు కొత్తగా కిటికీ పెట్టించాలంటే గోడను పగుల గొట్టించాలి – మళ్ళీ కిటికీ ఖర్చు – ఈ పనులన్నీ చేయటమా? మానటమా!

మళ్ళీ తెలిసిన వాళ్లందరి దగ్గరకూ పరుగులు పెట్టాడు. వెంకటరామయ్య... విన్న వాళ్ళలో కొందరు, "వాస్తు జోలికి పోకుండా ఉండటమే మంచిది. తీరా ఒక పెద్ద శాస్త్రజ్ఞుణ్ణి సంప్రదించీ, ఆయన చెప్పిన మేరకు చేయకపోతే, ఏది పోయి ఏది జరిగినా పశ్చాత్తాప పడిపోతావు. అయినా నీ మంచికే చెప్పాడనుకో, నువ్వు ఎటూ నమ్ముతున్నావు గాబట్టి, ఆ పనేదో తొందరగా చేయటమే, మంచిది" అంటూ సలహా ఇచ్చారు. మరికొందరైతే, "శాస్త్రం శాస్త్రమే, పాటించి తీరాల్సిందే" అని తీర్పు లాగా చెప్పేశారు.

ఒక నెల రోజుల కల్లా వెంకటరామయ్య గట్టిగా ఒక నిశ్చయానికొచ్చేసి, దోష నివారణ కోసం పని ప్రారంభించాడు. చాలా బలంగా పకడ్బందీగా చేసిన 'ఫ్లోరింగ్' కాబట్టి దాన్ని తొలగించే పనిలో చాలా నష్టం జరిగిపోయింది. మళ్ళీ కొత్తగా చాలా పాలిష్ బండలు కొనాల్సి వచ్చింది. దక్షిణం వేపు ఎత్తూ ఉత్తరం వేపు పల్లమూ వచ్చే పనంతా సక్రమంగా చేయించటానికి అన్ని ఖర్చులూ కలిసి పది వేలు దాటాయి వెంకట్రామయ్యకు!

ఈలోగా వెంకట్రామయ్యకు హైదరాబాద్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బంధువూ, మిత్రుడూ అయిన ప్రకాశం నుంచీ ఓ ఉత్తరం వచ్చింది. అందులో – "మీ వూరి యూనివర్శిటీలో జరిగే సెమినార్‌లో పాల్గొనటానికి వారం రోజుల్లో నేను వస్తున్నాననీ, రెండు రోజులపాటు మీ ఇంట్లో వుంటానని చాలా కాలం తర్వాత మీ కుటుంబాన్ని కలుస్తున్నందుకు చాలా ఆనందంగా వుందనీ" ఆయన రాశారు. వెంకటరామయ్య ఆ ఉత్తరం చదివి ఆనందించాడు. ప్రకాశం ద్వారా తమ పెద్దబ్బాయికి ఏదైనా ఉద్యోగావకాశం లభిస్తుందేమోనన్న పిసరంత ఆశ కూడా అతని ఆనందానికి కొంత కారణమై ఉండవచ్చు!

ఇంతలోగా ఇంటి వాస్తు దోషం తొలగించటానికి, రెండవ కార్యక్రమమైన కిటికీ పెట్టించే పని కూడా పూర్తి గావచ్చని అతను భావించాడు. అయితే అతను అనుకున్నంత తొందరగా పనులు జరగలేదు. బేల్దారు దొరకటంలో కొంత ఆలస్యం, కొలతల ప్రకారం కిటికీ చేయించటంలో కొంత ఆలస్యమూ జరిగాయి.

తీరా హైదరాబాదు మిత్రుడు వస్తున్న రోజునే బేల్దారు తన సిబ్బందితో వచ్చి పనికి నిలబడ్డాడు. ఎంత పని? సాయంత్రానికి పూర్తి చేసేస్తామంటూ అతగాడు రంగంలోకి దిగాడు. 'సరే' నన్నాడు వెంకటరామయ్య.

ఉదయం ఎనిమిదింటికి పని ప్రారంభమయింది. ముందుగా కిటికీ అమర్చాల్సిన ప్రదేశంలో గోడ పగల గొట్టాలి కదా? ఆ కిటికీ చిన్నదా, చితకదా? రెండుమీటర్ల పొడవూ, రెండుమీటర్ల వెడల్పూ వున్న కిటికీ అది! పెద్ద పెద్ద శబ్దాలతో పని ప్రారంభమయ్యింది. వెంకటరామయ్యా, ఆయన కుటుంబ సభ్యులూ పక్కన నిల్చుని జరిగే పని చూస్తుండి పోయారు.

గునపాల దెబ్బలకు, గోడ పెచ్చులూ, ఇటుక పెల్లలూ, ఊడి పడిపోతున్నాయి. నాలుగుదెబ్బలు పడినప్పుడల్లా గోడ భాగం ఉండలు ఉండలుగా రాలి పడిపోతోంది. కిటికీ అమర్చడానికి అవసరమైన భాగం మాత్రమే తొలగించాలి గాని వాళ్ళు ఆశించినట్టుగా గోడ చెప్పిన మాట వినేట్టు కన్పించటం లేదు. ఐదారు బలమైన దెబ్బలు ఒక్కసారిగా పడేసరికి. అక్కడున్న వాళ్ళెవరూ ఊహించని విధంగా ఉన్నట్లుండి ఒక్కసారిగా గోడ మొత్తం 'ధడా'మని పెద్ద శబ్దం చేస్తూ గబగబా కూలిపోవటంతో అందరూ బెంబేలెత్తి వెనక్కు పరుగులు తీశారు. ఆ గోడ నిర్మాణమే బలహీనంగా వుందో, లేకపోతే దాని పడగొట్టే పని వాళ్ళ నేర్పరితనంలో లోపమో ఏమో గాని అకస్మాత్తుగా గోడ మొత్తం కూలిపోయి, రూఫ్ నుండీ సిమెంటు పెల్లలు దడ దడ శబ్దం చేస్తూ రాలటంతో, ఇంట్లో పెద్ద అరుపులు ప్రారంభమై, చుట్టు పక్కల ఇళ్ళ వాళ్ళు ఒక్కుమ్మడిగా అక్కడకు చేరుకున్నారు. ఇంకేముంది, అంతా అయిపోయింది, ఇప్పుడో అప్పుడో పై కప్పే కూలి పోతుందా అన్నంత భయంకరంగా దృశ్యం, తయారుకావటంతో వెంకటరామయ్య ఉన్నపళంగా ఏడ్వటం మొదలు పెట్టేశాడు.

సరిగ్గా అదే సమయంలో ఇంటి ముందు ఆటో ఆగింది. ఆటో దిగి కాంపౌండ్‌లోకి అడుగు పెట్టిన ప్రకాశం, అక్కడ మూగివున్న జనాన్ని, వెంకటరామయ్య వాలకాన్ని చూసి, ఏం జరిగిందో తెలీక అచేతనుడైపోయాడు. అతని రాక గమనించిన వెంకటరామయ్య గబగబా ఎదురు వెళ్ళి, ఏదో చెప్పబోయి మాటలు చాతగాక గుడ్లనీరు కక్కుకున్నాడు. వెంకటరామయ్య భుజం మీద చేతులు వేసి ప్రకాశం లోపలకు పిల్చుకు వచ్చాడు. వెంకటరామయ్య పెద్ద కొడుకు ఆయన చేతిలోని సూట్‌కేస్‌ను అందుకోగా, పార్వతమ్మ అతనికెదురుగా నిల్చుని చీర చెంగుతో ముఖం కప్పుకుంది.

"అసలేం జరిగిందో చెప్పండర్రా! ఈ గోడ కూలి పోవడమేమిటి? అసలు గొడవలేమైనా జరిగాయా? ఇంటి ముందు ఈ జనం మూగడమేమిటి?" అంటూ

ఆయన బలవంతం చేసే సరికి, వెంకటరామయ్య ఈ మూడు నెలలుగా జరిగిన సంగతులన్నీ కాశీ మజిలీ కథలా చెప్పుకొచ్చాడు.

"నేనేదో అనుకుంటే మరేదో జరిగిపోయింది ప్రకాశం! ఇంటి దోషం తొలగించాలనుకుని, అసలు ఇంటికే ముప్పు తెచ్చి పెట్టుకున్నాను –" అంటూ మొరపెట్టుకునే తీరులో మాటలు కక్కేశాడు వెంకటరామయ్య.

అంతటి విషాదంలోనూ, ప్రకాశం పెదాల మీద ఒక చిన్న నవ్వు క్షణం పాటు మెలికలు తిరిగింది. తీరిగ్గా తను ఒక కుర్చీలో కూచుని, ఎదురుగా వెంకటరామయ్యను కూచోబెట్టుకుని, "ఎంత తెలివి తక్కువ వాడివిరా వెంకటరామయ్యా! వాస్తు దోషాలు తొలగించుకుంటే కుటుంబ సమస్యలు తీరిపోతాయనుకోవటం నీ ఆలోచనల్లోని మొదటి తప్పు – నీ పిల్లల నిరుద్యోగ సమస్య, మీ అమ్మాయి వివాహ సమస్యల్లాంటివి, దేశంలో నీ ఒక్క కుటుంబానికే దాపురించినవి కావు – నిరుద్యోగ సమస్య, వివాహ సమస్యలు అచ్చంగా సాంఘిక సమస్యలు. ఒక విధంగా చెప్పాలంటే మనిషి ఆరోగ్యం కూడా సామాజిక సమస్యే! సామాజిక సమస్యలకు పరిష్కారాలు, సామాజిక జీవితంలోనే వెతుక్కోవాలి..." అంటూ ఆగాడు ప్రకాశం వెంకటరామయ్యను వింటున్నాడా లేదా అన్న అనుమానంతో చూస్తూ.

వెంకటరామయ్య నోరు తెరచుకొని, జాగ్రత్తగా ప్రకాశం వేపే చూస్తూ వింటున్నట్టు తలూపాడు.

"నీ ఇంట్లో నేలను దక్షిణం వేపు ఎత్తుచేసి ఉత్తరం వేపు పల్లంగా మారిస్తేనో, లావెట్రీ గుంతను నైరుతి నుండి వాయవ్యానికి మారిస్తేనో, ఇంటి కిటికీలను సరి సంఖ్యగా సవరిస్తేనో ఈ సమస్యలు తీరవు. ఈ వాస్తు జ్ఞానమనేది మనం ఇటీవల నెత్తికెక్కించుకున్న నాగరిక మూఢ విశ్వాసం! మన పాత మూఢ విశ్వాసాలకు ఇప్పుడిప్పుడే కాలం చెల్లిపోతూ వుంది. వాటి స్థానంలో ఆధునికం అనిపించే అంధవిశ్వాసం ఒకటి మనకిప్పుడు కావాలి. ఆ విధంగా మనం తయారు చేసుకున్న కొత్తమూఢవిశ్వాసం ఈ వాస్తు నమ్మకం! సాంఘిక సమస్యల్ని పక్కదారి పట్టించే విశ్వాసం ఇది – "

వెంకటరామయ్య, విశాలంగా కళ్ళు విప్పి ప్రకాశం నోటి వేపే చూస్తూండిపోయాడు తల పంకిస్తూ –

"అసలు మనిషికి ఇల్లెందుకు? ఎండా, గాలీ, చలి నుంచీ రక్షణ కోసం, దొంగల నుంచీ తనకున్నదేదో కాపాడుకోటం కోసం – అంతే! మనం కట్టుకొనే ఇల్లు ఈ ప్రయోజనాలు నెరవేర్చేదిగా ఉండటంతో పాటు, చక్కగా గాలీ, వెలుతురూ లభ్యమయ్యేలా వుండేట్టు చూసుకుంటే చాలు! పూరి పాకల్లోనూ, మట్టి కొంపల్లోనూ దేశంలో ఎన్ని కోట్ల మంది నివసిస్తున్నారో చూడు! వాళ్ళ సమస్యల్తో పోలిస్తే ఇంత పెద్ద ఇంట్లో వుంటున్న నీదీ ఒక సమస్యేనా? జీవితం 'భద్రంగా' సాగిపోతూన్న వాళ్ళనే అనవసర భయాలు పట్టుకుంటాయి – తమ 'భద్రత' కెక్కడ ఎప్పుడు ఏ విధంగా ముప్పు వచ్చిపడుతుందోనన్న భయమే ప్రతి అడ్డ మొచ్చిన విశ్వాసాన్నీ నమ్మేలా చేస్తుంది. కాస్త తెలివి ఉపయోగించి ఇప్పటికైనా ఆలోచించు–" అంటూ సుతిమెత్తగా చీవాట్లు పెడుతూంటే చేష్టలు దక్కి నిరామయంగా చూస్తూండి పోయాడు వెంకటరామయ్య.

❖ ❖ ❖

సరిగ్గా నెల రోజుల తర్వాత...

ఉదయం తొమ్మిది గంటలు దాటుతుండగా, అప్పటికప్పుడే బ్రేక్‌ఫాస్ట్ ముగించి, వరండాలో వాలు కుర్చీలో పడుకుని, కాఫీ నెమ్మదిగా సేవిస్తూ ఆ వేళటి దినపత్రిక విరామంగా చదువుతూన్న వెంకటరామయ్య, గేటు చప్పుడు వినిపించి మెల్లగా తల తిప్పి అటు వేపు చూశాడు.

గేటు తెరచుకొని కృష్ణమూర్తి, నవ్వు మొగంతో వచ్చి వెంకటరామయ్య కెదురుగా వున్న కుర్చీలో కూచుని, ఏదో చెప్పాలని నోరు విప్పబోతూండగా, "రేయ్! కృష్ణమూర్తీ, నా ఇంటిని గురించి ఒక్క మాట కూడా మాట్లాడనంటేనే, నీ నోరు మెదపనిస్తాను" అంటూ సడన్‌గా లేచి తన అరచేత్తో అతని నోటిని గట్టిగా మూసేశాడు వెంకటరామయ్య.

❖ **రచన, ఆగష్టు 1994**